# హెలికాప్టర్ టూరు.. కాంగ్రెస్‌లో పోరు

**మంత్రుల మధ్య గాలిమోటర్ పోటీ**

- సీఎం రేవంత్‌కు దీటుగా మంత్రులు భట్టి, ఉత్తమ్
- 2 గంటల రోడ్డుమార్గం.. అయినా హెలికాప్టర్
- దుబారాపై సోషల్ మీడియాలో విమర్శలు
- సీఎం సీరియస్.. కోమటిరెడ్డి హెలికాప్టర్ టూర్ రద్దు

నల్లగొండ ప్రతినిధి, సెప్టెంబర్ 18 (నమస్తే తెలంగాణ): పొద్దున లేస్తే గత బీఆర్‌ఎస్ సర్కార్‌పై ఒంటి కాలుతో లేచే కాంగ్రెస్ ప్రభుత్వ పెద్దలు తమ మధ్య ఆధిపత్య పోరులో సర్కారు సొమ్మును దుబారా చేస్తున్నారా? అంటే అందుకు వాళ్లు చేస్తున్న టూర్లే నిదర్శనంగా నిలుస్తున్నాయి. అవసరం ఉన్న సమయంలోనో.. అత్యవసర సమయంలో హెలికాప్టర్ ప్రయాణాలు అంటే ఎవరికీ అభ్యంతరాలు ఉండవు. కానీ చీటికిమాటికి హెలికాప్టర్‌లో రావటం కాంగ్రెస్ సర్కార్ పెద్దలు ఫ్యాషన్‌గా ఫీల్ అవుతున్న పరిస్థితులు నెలకొన్నాయి. సీఎం రేవంత్‌రెడ్డితోపాటు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మరో సీనియర్ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి హెలికాప్టర్ జర్నీ కోసం ఢీ అంటే ఢీ అంటున్నారు. ఇదే అదనుగా మిగతా మంత్రులు 'గాలి ప్రయాణాల'కు సై అంటుండటం చర్చనీయాంశంగా మారింది. ఈ చర్చ బుధవారం మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి హెలికాప్టర్ ప్రయాణం రద్దుకు కారణమైనట్టు సమాచారం. సీఎం రేవంత్‌రెడ్డి ఆగ్రహంతో కోమటిరెడ్డికి అధికారులు హెలికాప్టర్ ఇవ్వకపోవటం చర్చనీయాంశంగా మారింది.

### పోటీ పడి హెలికాప్టర్ ప్రయాణం కోసం క్యూ

సీఎం హోదాలో రేవంత్‌రెడ్డి హెలికాప్టర్ ప్రయాణం సాధారణమే. కానీ సీఎం కంటే తామే సీనియర్లం.. హోదా పక్కనపెడితే పాలన వ్యవహారాల్లో సైతం తామే అనుభవజ్ఞులం అనే ధోరణితో ఇతర మంత్రులు కనిపిస్తున్నారు. ముఖ్యంగా డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, శ్రీధర్‌బాబు, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి వంటివాళ్లు రేవంత్‌రెడ్డి తమకంటే ఎక్కువేంటన్న వైఖరిని ప్రదర్శిస్తున్నారు. అందుకే రేవంత్ ఒక్కసారి హెలికాప్టర్ ఎక్కితే తాము రెండు సార్లు అన్నట్టుగా పరిస్థితి తయారైంది. కొన్నిసార్లు గంటలో రోడ్డుమార్గంలో వెళ్లే కార్యక్రమానికీ హెలికాప్టర్ జర్నీకే మొగ్గు చూపుతుండటం చర్చకు దారితీసింది. ఈ మధ్య నల్లగొండ జిల్లాలో మంత్రుల పర్యటనలను పరిశీలిస్తే హెలికాప్టర్‌ను ఎలా వాడేస్తున్నారో అర్థం అవుతుంది. బుధవారం సొంత జిల్లా నల్లగొండ పరిధిలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఒక్కరే నాగార్జునసాగర్ నియోజకవర్గం హాలియాతోపాటు మిర్యాలగూడలో పర్యటించాల్సి ఉన్నది. ఈ పర్యటనకు హెలికాప్టర్‌లో వస్తున్నట్టు ముందుగా అధికార పర్యటన షెడ్యూల్ విడుదలైంది. వాస్తవంగా హైదరాబాద్ నుంచి బయల్దేరితే సరిగ్గా రోడ్డుమార్గంలో గంటన్నరలో ఇక్కడ ఉండవచ్చు. హాలియాలో గురుపూజోత్సవం, మిర్యాలగూడలో ఫ్లైఓవర్ల శంకుస్థాపనతో పాటు గురుపూజోత్సవ కార్యక్రమాలకు కోమటిరెడ్డి హాజరు కావాల్సి ఉన్నది. హెలికాప్టర్ వినియోగంపై విమర్శలు రావటంతో ప్రభుత్వ వర్గాల ద్వారా సీఎం దృష్టికి వెళ్లినట్టు తెలిసింది. దాంతో హెలికాప్టర్ ఇవ్వొద్దని సంబంధిత వర్గాలకు ఆదేశాలు ఇచ్చినట్టు సమాచారం. దీంతో కోమటిరెడ్డికి ఊహించని షాక్ తగిలింది. అప్పటికప్పుడు రోడ్డుమార్గంలో బయల్దేరిన కోమటిరెడ్డి.. హాలియా పర్యటనను రద్దు చేసుకుని నేరుగా మిర్యాలగూడకు చేరుకున్నారు.

### ఇటీవల హెలికాప్టర్ పర్యటనలివే..

- ఆగస్టు 2వన నాగార్జునసాగర్ ఎడమ కాల్వకు నీటి విడుదల చేసేందుకు మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి హెలికాప్టర్‌లోనే వచ్చి వెళ్లారు.
- ఆగస్టు 9న సుంకిశాల పర్యటనకు మంత్రులు ఉత్తమ్, తుమ్మల, మండలి చైర్మన్ గుత్తా హెలికాప్టర్‌లో వచ్చారు. హైదరాబాద్ నుంచి ఉత్తమ్, గుత్తా హెలికాప్టర్‌లో వచ్చి ఖమ్మం నుంచి కోదాడ వచ్చిన మంత్రి తుమ్మలను ఎక్కించుకుని తిరిగి సుంకిశాలకు చేరుకున్నారు. తుమ్మల నాగేశ్వర్‌రావుమే కోదాడ ల్యాండ్ అయ్యి అక్కడి నుంచి సుంకిశాలకు వచ్చారు.
- ఆగస్టు 15న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్వాతంత్ర్య దినోత్సవ జెండావిష్కరణ కోసం సూర్యాపేటకు హెలికాప్టర్‌లో వెళ్లారు. అక్కడ ఆయనను దించాక నల్లగొండకు ఖాళీగా హెలికాప్టర్ వచ్చింది. ఇక్కడ స్వాతంత్ర్య దినోత్సవంలో పాల్గొన్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని ఎక్కించుకుని తిరిగి సూర్యాపేటలో హెలికాప్టర్ ల్యాండ్ అయ్యింది. అక్కడి నుంచి ఉత్తమ్, కోమటిరెడ్డి కలిసి కొత్తగూడెంలో జరిగిన సీఎం రేవంత్‌రెడ్డి బహిరంగ సభకు హెలికాప్టర్‌లో వెళ్లారు.
- ఆగస్టు 30న భువనగిరి లోక్‌సభ స్థాయి ఇరిగేషన్ మీటింగ్‌కు మంత్రులు ఉత్తమ్, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి హెలికాప్టర్‌లో రాగా, హెలిప్యాడ్ వద్ద సీఎం పర్యటన తరహాలో మెటల్ డిటెక్టర్ తనిఖీలు చేపట్టారు. తాము సీఎంకు తక్కువేం కాదన్న ధోరణితోనే మెటల్ డిటెక్టర్ తనిఖీలకు మంత్రులు ఆదేశాలిచ్చినట్టు సమాచారం. ఈ తరహా తనిఖీ నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, పోలీసులకు మధ్య గొడవకు దారితీసింది.
- ఈ నెల 11న యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌కు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్, కోమటిరెడ్డి హెలికాప్టర్‌లో వచ్చారు.




హెలికాప్టర్‌లో పర్యటనకు వచ్చిన మంత్రులు ఉత్తమ్, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి(ఫైల్)

# రుణమాఫీ అంకెల గారడీ

- చేసింది గోరంత, చెప్పకునేది కొండంత
- కేసీఆర్ ఇచ్చిన రైతుబంధు డబ్బులే డైవర్ట్ చేసిన్రు
- రాష్ట్ర ప్రభుత్వంపై మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ఆగ్రహం

జగిత్యాల, సెప్టెంబర్ 18: 'కాంగ్రెస్ ప్రభుత్వం జబ్బలు చరుచుకుంటూ గొప్పలు చెప్పుకుంటున్న రుణమాఫీ పూర్తిగా అంకెల గారడీ. చేసింది గోరంత అయితే, చెప్పుకునేది కొండంత' అని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ధ్వజమెత్తారు. జిల్లాలో రుణమాఫీ కాని రైతులకు మద్దతుగా బీఆర్‌ఎస్ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్ రావు ఆధ్వర్యంలో కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్ కల్వకుంట్ల, మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత, రైతులతో కలిసి బుధవారం కలెక్టరేట్‌కు వెళ్లి కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించారు. రుణమాఫీ కానీ రైతుల వివరాలను అందజేశారు. ఈ సందర్భంగా కొప్పుల ఈశ్వర్ మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి కుర్చీలో కూర్చునే దాకా ఓ మాట, కూర్చున్నాక మరో మాట మాట్లాడుతున్నారని విమర్శించారు. డిసెంబర్ 9న రైతులందరికీ రుణమాఫీ, రైతు భరోసా కింద పంట పెట్టుబడి, రైతు కూలీలకు డబ్బులు ఇస్తామని మాయ మాటలు చెప్పారని, తీరా అధికారంలోకి వచ్చాక చేతులెత్తేశారని మండిపడ్డారు. కేసీఆర్ ఇచ్చిన రైతుబంధు పైసలే రుణమాఫీకి డైవర్ట్ చేశారని, అనేక ఆంక్షలు పెట్టి వేలాది మందికి మాఫీ ఎగ్గొట్టారని, పైకి మాత్రం రైతులందరికీ రూ.2లక్షలు మాఫీ చేసి బడాయి కొడుతున్నారని ధ్వజమెత్తారు. ఎలాంటి ఆంక్షలు లేకుండా రుణమాఫీ చేయాలని, లేదంటే రైతు ఉద్యమం మొదలవుతుందని, పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు.



జగిత్యాల కలెక్టర్ ఆవరణలో మాట్లాడుతున్న మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, పక్కన బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్ రావు, కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్ కల్వకుంట్ల, చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ వసంత




వరంగల్ జిల్లా పర్వతగిరిలో బ్యాంకు బయట విలేకరులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

## కాంగ్రెస్ ధోకా సర్కార్

- రైతులను నిండా ముంచింది
- రుణమాఫీపై మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు
- కలెక్టర్‌కు ఫోన్ చేసి రైతులకు న్యాయం చేయాలని వినతి

పర్వతగిరి, సెప్టెంబర్ 18: రైతులను నిండా ముంచిన కాంగ్రెస్ ధోకా సర్కార్ అని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు విమర్శించారు. బుధవారం ఆయన వరంగల్ జిల్లా పర్వతగిరి మండల కేంద్రంలోని ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకుకు వెళ్లి రుణమాఫీ వివరాలను అడిగి తెలుసుకున్నారు. బ్యాంకు పరిధిలో 600 మంది రైతులు రూ.6 కోట్ల రుణం తీసుకుంటే కేవలం 200 మంది రైతులకు రూ. కోటీ 30 లక్షలు రుణమాఫీ అమలైందని సిబ్బంది తెలిపారు. వెంటనే కలెక్టర్‌కు ఫోన్ చేసి రైతులకు పూర్తిగా అన్యాయం జరిగిందని, రుణమాఫీ చేసేలా చర్యలు తీసుకోవాలని విన్నవించారు. ఈ సందర్భంగా దయాకర్ రావు మాట్లాడుతూ.. రైతు రుణమాఫీ అంటూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతన్నలను మోసగించడం తప్ప ఆచరణలో మాత్రం అమలు చేయడంలేదని వాపోయారు. రైతుబంధుకు రాంరాం చెప్పి.. రుణమాఫీ పేరుతో అనేక ఆంక్షలు విధించి రైతులను అరిగోస పెడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని రైతన్నలకు సూచించారు. ఆయన వెంట పార్టీ మండల కన్వీనర్ ఎర్రబెల్లి రాజేశ్వర్‌రావు, మాజీ ఎంపీటీసీలు మాడుగుల రాజు, కర్మిళ్ల మోహన్‌రావు, మాజీ సర్పంచ్ చిన్నపాక శ్రీనివాస్, ఏర్పుల శ్రీనివాస్, అమడగాని రాజు, బానోతు వెంకన్న పాల్గొన్నారు.



సిద్దిపేట జిల్లా మిరుదొడ్డి తహసీల్ కార్యాలయం వద్ద రైతు ధర్నాలో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు తోట కమలాకర్‌రెడ్డి

## రుణమాఫీ చేయకుంటే సచివాలయం ముట్టడిస్తాం

- మిరుదొడ్డి మండల రైతులు, బీఆర్‌ఎస్ నాయకులు
- తహసీల్ కార్యాలయం ఎదుట వెయ్యి మంది రైతుల ధర్నా

మిరుదొడ్డి, సెప్టెంబర్ 18: ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు అర్హులైన రైతులందరికీ వందశాతం పంట రుణాలు మాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్‌ఎస్ నాయకులు, రైతులు ఆందోళనకు దిగారు. సిద్దిపేట జిల్లా మిరుదొడ్డి తహసీల్ కార్యాలయం ఎదుట బుధవారం వందలాది మంది రైతులు బైఠాయించారు. 10 గ్రామాలకు చెందిన వెయ్యి మందికి పైగా రైతులు ధర్నా నిర్వహించారు. రుణమాఫీ కాని 780 మంది రైతుల జాబితాను డిప్యూటీ తహసీల్దార్ వీరేశ్‌కు అందజేశారు. ఏవేవో కొర్రీలు పెట్టి తమకు రుణమాఫీ చేయకుండా కాంగ్రెస్ సర్కారు అన్యాయం చేస్తున్నదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. సాకులు మాని వెంటనే రైతులందరికీ రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి రైతులకు సంఘీభావం తెలిపారు. వందశాతం రుణమాఫీ చేయకపోతే రైతులతో కలిసి కలెక్టరేట్, సచివాలయం ముట్టడిస్తామని ఫోన్‌లో ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఆందోళనలో బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు తోట కమలాకర్‌రెడ్డి, పార్టీ మండలాధ్యక్షుడు అంజిరెడ్డి, మాజీ సర్పంచులు బాల్‌రాజు, బాల్‌నర్సయ్య, రైతు విభాగం మండలాధ్యక్షుడు దుర్గారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

### దళితబంధు లబ్ధిదారుల ఆందోళన



కరీంనగర్ జిల్లా హుజూరాబాద్‌లో దళితబంధు లబ్ధిదారులు ఆందోళనకు దిగారు. రెండో విడత కింద ఒక్కొక్కరికి రూ.5 లక్షల చొప్పున నిధులు విడుదల చేయకుండా సర్కార్ ఇబ్బంది పెడుతుందంటూ బుధవారం స్థానిక అంబేద్కర్ చౌరస్తా వద్ద రాస్తారోకో చేశారు. 'మమ్ముల గోస పెట్టినోళ్లు మా ఉసురు తాకిపోతరు' అంటూ వారు ప్రభుత్వానికి శాపనార్థాలు పెట్టారు. – హుజూరాబాద్ టౌన్

## గవర్నర్ గారూ.. రుణమాఫీ అయ్యేలా చూడండి

- కాంగ్రెస్ అసెంబ్లీ ఎన్నికలకు ముందు మాటిచ్చింది
- ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మాఫీ చేయలేదు
- గవర్నర్‌కు ఉత్తరాలు రాసిన నెన్నెల మండల రైతులు

నెన్నెల, సెప్టెంబర్ 18: 'అయ్యా గవర్నర్ గారూ.. మాకు రుణమాఫీ కాలేదు.. మమ్మల్ని పట్టించుకుని రుణమాఫీ అయ్యేలా చూడండి' అంటూ 300 మందికిపైగా రైతులు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు ఉత్తరాలు రాశారు. మంచిర్యాల జిల్లా నెన్నెల మండలంలోని మైలారం, గొల్లపల్లి, ఘన్‌పూర్, నందులపల్లి, నెన్నెల, జంగాల్‌పేటకు చెందిన రుణమాఫీ కాని రైతులందరూ బుధవారం మండలంలోని పోస్టాఫీస్‌కు చేరుకున్నారు. రాజ్‌భవన్‌కు రిజిస్టర్ పోస్టు చేశారు. ఈ ఉత్తరాల్లో రైతు వివరాలతో పాటు తీసుకున్న రుణం, బ్యాంకు ఖాతా నంబర్ రాశారు. 'కాంగ్రెస్ అసెంబ్లీ ఎన్నికల సమయంలో రైతులకు పంట రుణం రూ.2 లక్షలు మాఫీ చేస్తామని మ్యానిఫెస్టోలో పెట్టింది. ప్రభుత్వం ఏర్పాటయ్యాక బడ్జెట్ ప్రసంగంలో కూడా రుణమాఫీ చేస్తున్నట్టు తమ ద్వారా(గవర్నర్) మాట్లాడించారు. ఇటీవల మూడు విడతలుగా రుణమాఫీ చేశారు. కానీ.. మాకు అన్ని అర్హతలు ఉన్నా రుణమాఫీ కాలేదు. రుణమాఫీ అయ్యేలా చర్యలు తీసుకోవాలని రెండు చేతులతో ప్రార్థిస్తున్నాం..' మీ రైతు సోదరుడు అంటూ గవర్నర్‌కు ఉత్తరాలు రాసి నెన్నెల పోస్టాఫీసులో రిజిస్టర్ పోస్టు చేశారు.



గవర్నర్‌కు రాసిన ఉత్తరాలతో పోస్టాఫీస్ వద్ద మంచిర్యాల జిల్లా నెన్నెల మండల రైతులు

### మాఫీ అంటివి.. నాకెందుకు కాలేదు?



ఓట్లప్పుడేమో పంట లోను ఉన్నోళ్లకు రెండు లచ్చలు మాఫీ జేస్తానని ఓట్లకచ్చిండ్లు. ఓట్లయినంక కొందరికే చేసింఢ్రు. నేను నెన్నెల బేంకులో రూ. లచ్చఅరవై వేల పంట లోను తీసుకున్న. మాఫీ జేస్తరని నమ్మి ఓటు వేసిన. కానీ.. ఒక్క రూపాయి కూడా మాఫీ చేయలే. ఎవుసం పని ఇడిసి పెట్టి లోను మాఫీ కాలేదని బేంకుల సుట్టూ తిరిగినా ఎవరు సప్పుడు చేయట్లే. నా భార్యకు కూడా పంట లోను ఉంది. ఆమేకు కూడా రాలేదు. ఇక్కడకు వచ్చి పెద్దాయనకు ఉత్తరం రాసిన. న్యాయం జేస్తడని అనుకుంటున్న. – సోంసెట్టి మల్లయ్య, రైతు, నందులపల్లి

## నేడు చలో ప్రజాభవన్

మొదటిపేజీ తరువాయి...

రాష్ట్ర క్యాబినెట్ సమావేశం జరుగుతున్న నేపథ్యంలో రుణమాఫీపై నిర్ణయం తీసుకొనేలా ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు రైతులంతా తరలిరావాలని కోరారు. తమ పోరాటానికి అన్ని కుల సంఘాలు మద్దతు తెలపాలని కోరారు. రుణమాఫీ కాలేదనే బాధతో రైతులు చనిపోతున్నారని, ఇప్పటికైనా ప్రభుత్వం ఎలాంటి షరతులు లేకుండా రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. సోషల్ మీడియా వేదికగా ఏకమవుతున్న రైతులు చలో ప్రజాభవన్ ఆందోళనకు తరలివచ్చేందుకు సిద్ధమవుతున్నట్టు తెలిసింది. ఎక్కడికక్కడ గ్రామాల వారీగా రుణమాఫీ కాని రైతులు స్వచ్ఛందంగా ముందుకొస్తున్నట్టు తెలిసింది. ఎన్నికల సమయంలో ఎలాంటి షరతులు లేకుండా రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రైతులకు హామీ ఇచ్చారు. అయితే కఠిన నిబంధనలు, షరతులతో అర్హులైన రైతుల సంఖ్యలో కోత పెట్టారు. దాదాపు 70 లక్షల మంది రుణ గ్రహీతలు ఉండగా 42 లక్షల మందికి మాత్రమే రుణమాఫీ చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ఇప్పటివరకు 23 లక్షల మంది రైతులకు రూ.18 వేల కోట్లు మాత్రమే మాఫీ చేసింది. ప్రభుత్వం పేర్కొన్న అన్ని అర్హతలు ఉన్న రైతుల్లో చాలామందికి ఇంకా మాఫీ కాలేదు. దీంతో ఆయా రైతులు ఆందోళనకు సిద్ధమవుతున్నారు.



అసోంలోని నగాన్ జిల్లా పామ్‌గోన్ గ్రామంలో మొక్కలు నాటుతున్న స్థానికులు

## అసోంలో 'గ్రీన్ ఇండియా చాలెంజ్'కు విశేష స్పందన

**ఉత్సాహంగా పాల్గొని మొక్కలు నాటిన స్థానికులు**

హైదరాబాద్, సెప్టెంబర్ 18 (నమస్తే తెలంగాణ): హరిత భారత్ సాధనే లక్ష్యంగా గ్రీన్ ఇండియా చాలెంజ్ అసోంలో మొదలుపెట్టిన కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తున్నది. 2030 నాటికి అసోంలో ఒక కోటి మొక్కలు నాటాలనే లక్ష్యంతో గ్రీన్ ఇండియా చాలెంజ్ పనిచేస్తున్నది. ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినం సందర్భంగా నగాన్ జిల్లా పామ్‌గోన్ గ్రామంలో ఒకేచోట 74 మొక్కలను నాటారు. పద్మశ్రీ, ఫారెస్ట్ మ్యాన్ ఆఫ్ ఇండియాగా పేరొందిన జాదవ్ పయంగ్ స్ఫూర్తితో మాజీ ఎంపీ జోగినపల్లి సంతోష్ కుమార్ చేపట్టిన కోటి మొక్కల కార్యక్రమానికి తమ మద్దతు ఉంటుందని అస్సామీలు తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా వస్తున్న పర్యావరణ మార్పులు, పెరుగుతున్న ఉష్ణోగ్రతలు క్రమంగా రుతువుల మార్పులకు కూడా కారణమవుతున్నాయని సంతోష్‌కుమార్ చెప్పారు. పెద్ద సంఖ్యలో మొక్కలు నాటి, సంరక్షిస్తే పర్యావరణ మార్పులను అడ్డుకోవచ్చని, ఇందుకోసం స్థానికుల మద్దతు తీసుకుంటామని తెలిపారు. అసోంలో ఏప్రిల్‌లో ఈ కార్యక్రమాన్ని మొదలు పెట్టామని, ఇప్పటిదాకా రెండున్నర లక్షల మొక్కలు నాటామని ఇగ్నైటింగ్ సంస్థ వ్యవస్థాపకుడు కరుణాకర్ తెలిపారు. ఈ మొక్కలను జియోట్యాగ్ చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో రీతురాజ్, రోసీదేవి, వలంటీర్లు పాల్గొన్నారు.

## బిల్లులు రాక రోడ్డెక్కిన పాలరైతులు

- మూడు నెలలుగా ఎదురుచూపులు
- జాతీయ రహదారిపై పాలు పారబోసి నిరసన

ఆమనగల్లు, సెప్టెంబర్ 18: మూడు నెలలుగా విజయ డెయిరీ పాలశీతలీకరణ కేంద్రాల్లో పాడి రైతులకు బిల్లులు చెల్లించడం లేదు. దీంతో ఆమనగల్లు, కడ్తాల్, తలకొండపల్లి, మాడ్గుల మండలాల పాడి రైతులు బీఆర్‌ఎస్ నేతలతో కలిసి ధర్నా నిర్వహించారు. ముందుగా మండల పరిషత్ కార్యాలయంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి వినతిపత్రం అందజేశారు. అనంతరం హైదరాబాద్– శ్రీశైలం జాతీయ రహదారికి ర్యాలీగా చేరుకుని రాజీవ్‌గాంధీ చౌరస్తాలో రోడ్డుపై పాలు పారబోసి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం తహసీల్దార్ లలితకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాజీ జడ్పీటీసీ నేనావత్ అనురాధ, డీసీసీబీ డైరెక్టర్ గంప వెంకటేష్‌గుప్తా మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో 15 రోజులకోసారి బిల్లులు చెల్లించారని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మూడు నెలలుగా పాల బిల్లులు చెల్లించకపోవడంతో పాడి రైతులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. రైతులకు బిల్లులు చెల్లించాలని, లేని పక్షంలో ట్రాక్టర్లతో అసెంబ్లీని ముట్టడిస్తామని హెచ్చరించారు. స్థానిక బీఆర్‌ఎస్ నాయకులు ఈ ఆందోళనలో పాల్గొన్నారు.



ఆమనగల్లులో హైదరాబాద్– శ్రీశైలం జాతీయ రహదారిపై పాలు పారబోస్తూ నిరసన తెలుపుతున్న బీఆర్‌ఎస్ శ్రేణులు, పాడి రైతులు

## రీజినల్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ మార్చాలి

**మాజీ ఎమ్మెల్యేలు కూసుకుంట్ల, జూలకంటి**

భువనగిరి కలెక్టరేట్, సెప్టెంబర్ 18: చౌటుప్పల్ మండలం మీదుగా వెళ్తున్న రీజినల్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్‌ను మార్చి బాధితులకు మార్కెట్ ధర ప్రకారం నష్టపరిహారం చెల్లించాలని మాజీ ఎమ్మెల్యేలు కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, జూలకంటి రంగారెడ్డి డిమాండ్ చేశారు. ట్రిపుల్ ఆర్ నిర్మాణంలో భూములు కోల్పోతున్న వారితో కలిసి యాదాద్రి భువనగిరి కలెక్టరేట్ వద్ద బుధవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో అలైన్‌మెంట్ మార్చాలని ధర్నాలు చేసిన ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, జిల్లా మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఇప్పుడు బాధ్యత వహించి నిర్వాసితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్ హనుమంతు కె.జెండగేకు వినతిపత్రం అందజేశారు. అంతకుముందు చౌటుప్పల్ ఆర్డీవో కార్యాలయం వద్ద ట్రిపుల్ ఆర్ నిర్వాసితులు ధర్నా చేశారు. కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మేక అశోక్‌రెడ్డి, మాటూరి బాలరాజు గౌడ్, రైతు ఐక్య వేదిక నాయకులు బూరుగు కృష్ణారెడ్డి, చింతల దామోదర్‌రెడ్డి, కోమటిరెడ్డి చంద్రారెడ్డి, గంగాదేవి సైదులు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రానికి మళ్లీ వర్ష సూచన

- 20, 21 తేదీల్లో భారీ వర్షాలు
- పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్

హైదరాబాద్, సెప్టెంబర్ 18 (నమస్తే తెలంగాణ): బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావం రాష్ట్రంపై పెద్దగా లేకపోయినా.. ఆంధ్రప్రదేశ్, యానాంలో దిగువ ట్రోపో ఆవరణంలో మార్పులు, నైరుతి దిశగా వీస్తున్న గాలులతో తెలుగు రాష్ట్రాల్లోని పలు జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఉదయం ఎండ తీవ్రత ఉన్నా.. సాయంత్రానికి వాతావరణం చల్లబడి వర్షాలు కురుస్తాయని చెప్పింది. సెప్టెంబర్ 20, 21 తేదీల్లో పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ అంచనా వేసింది. ఈ మేరకు పలు జిల్లాలకు ఎల్లోఅలర్ట్ జారీ చేసింది. 21న ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, భూపాలపల్లి, ములుగు, భద్రాద్రికొత్తగూడెం జిలాల్లో అక్కడక్కడా భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ పేర్కొన్నది.

## డిజిటల్ సాగు రైతాంగానికి ముప్పు

- బీజేపీ వ్యవసాయ విధానాలను ఐక్యంగా తిప్పికొట్టాలి
- ఎంపీ, ఏఐకేఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు అమ్రారామ్

హైదరాబాద్, సెప్టెంబర్ 18 (నమస్తే తెలంగాణ): డిజిటల్ అగ్రికల్చర్ మిషన్‌తో దేశ రైతాంగానికి తీరని ముప్పు పొంచి ఉన్నదని సికార్ ఎంపీ, ఏఐకేఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు అమ్రారామ్ ఆందోళన వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లోని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కార్యాలయంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. డిజిటలైజేషన్ పేరుతో కార్పొరేట్ల చేతుల్లో వ్యవసాయ రంగాన్ని పెట్టజూస్తున్నారని ధ్వజమెత్తారు. ఇటీవల డిజిటల్ అగ్రికల్చర్ మిషన్ (డీఏఎం)కు అధిక ప్రాధాన్యం ఇస్తూ 7 కొత్త పథకాలను కేంద్ర క్యాబినెట్ ఆమోదించిందని గుర్తుచేశారు. అంతర్జాతీయ ఆర్థిక పెట్టుబడిదారుల డిమాండ్లకు అనుగుణంగా దేశ వ్యవసాయ రంగాన్ని పూర్తిగా డిజిటలైజేషన్ చేయడానికే ఈ ప్రాజెక్టు చేపట్టారని ఆరోపించారు. పంట ఉత్పత్తులకు కనీస మద్దతు ధర ఇవ్వాలని, వ్యవసాయ ఉపకరణాలన్నింటిపై జీఎస్టీని ఉపసంహరించడం ద్వారా ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించాలని, రైతుల రుణభారాన్ని రద్దు చేయాలని కోరారు.

## కేకే-5 గనిలో ప్రమాదం.. కార్మికుడి మృతి

మందమర్రి, సెప్టెంబర్ 18: మందమర్రి ఏరియాలోని సింగరేణి కేకే –5 గనిలో మంగళవారం రాత్రి జరిగిన ప్రమాదంలో కోల్‌కట్టర్ కార్మికుడు మోకెనపల్లి లక్ష్మణ్(44) మృతి చెందాడు. కుటుంబ సభ్యులు, కార్మికులు తెలిపిన వివరాల ప్రకారం..మందమర్రి పట్టణంలోని రెండోజోన్ కాలనీకి చెందిన లక్ష్మణ్ రెండో షిఫ్టు విధులకు వెళ్లి గనిలో నుంచి తిరిగి వస్తుండగా ప్రమాదవశాత్తు కిందపడిపోయాడు. స్థానిక కేకే డిస్పెన్సరీకి తరలించగా, వైద్యులు అందుబాటులో లేకపోవడంతో రామకృష్ణాపూర్ ఏరియా దవాఖానకు తరలించారు. పరీక్షించిన వైద్యులు లక్ష్మణ్ మృతి చెందినట్టు నిర్ధారించారు. ఏరియా జీఎం జీ.దేవేందర్ ఘటనా స్థలాన్ని సందర్శించి గని అధికారులతో కలిసి విచారణ చేపట్టారు. లక్ష్మణ్ మృతి సాధారణ మరణంగా అధికారులు పేర్కొంటున్నారనే విషయం తెలుసుకొని గని వద్ద కార్మికులు, టీబీజీకేఎస్ తదితర కార్మిక సంఘాల నాయకులు బుధవారం ఆందోళన చేపట్టారు. చివరకు లక్ష్మణ్ విధి నిర్వహణలోనే మరణించినట్టు యాజమాన్యం ప్రకటించింది.